శిథిల భవనాలు

- పొంచి ఉన్న ప్రమాదం
- ఊడుతున్న పెచ్చులు
- భయంభయంగా ఉద్యోగుల విధులు



పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయ భవనం



శిథిలావస్థకు చేరిన కౌటాల ఎంపీడీవో కార్యాలయం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం, ఎంఈవో కార్యాలయ భవనాలు గత 30 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతు చేపట్టలేదు. ప్రస్తుతం భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. సిమెంట్ స్లాబ్‌పై కప్పు, కిటీకిలు, తలుపులు పూర్తి పగిలిపోయాయి. భవనాల స్లాబ్‌లు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాకాలంలో ఊరుస్తుండడంతో ధ్రువీకరణ పత్రాలు, ఫైళ్లు తడిసి ముద్దవుతున్నాయి.

ఊడుతున్న పెచ్చులు

తహసీల్దార్ కార్యాలయంపై పెచ్చులు కిందపడుతుండడంతో ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. పలుమార్లు పెచ్చులు వారిపై పడడంతో గాయాలైన సందర్భాలున్నాయి. తహసీల్దార్ కార్యాలయ గోడలపై చెట్లు పెరిగి అవి పగులుతున్నాయి. ప్రతీరోజు తహసీల్దార్ కార్యాలయానికి గ్రామాల నుంచి రైతులు, విద్యార్థులు వస్తుంటారు. వర్షాకాలం కావడంతో శిథిలావస్థకు చేరిన కార్యాలయానికి రావాలంటే మండల వాసులు జంకుతున్నారు. కొన్నేళ్లుగా తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ నూతన కార్యాలయాల భవనాలను నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని మండల వాసులు, ఉద్యోగులు కోరుతున్నారు.

కొత్త భవనాలు నిర్మించాలి



ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– కె అనిల్, మొగడ్‌దగడ్

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

- గ్రామాల్లో దోమల స్వైర్య విహారం
- మరమ్మతు లేక మిషన్లు నిరుపయోగం
- ప్రజలకు తిప్పలు



నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్

లింగాపూర్: గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోతుండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన మిషన్ల మరమ్మతు చేపట్టడం లేదు. నిధుల కొరతతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో దోమలు స్వైరవిహారంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు.

మండలంలో..

సర్పంచుల పాలన ముగియడంతో ఒకటి, రెండు పంచాయతీలకు గెజిటెడ్ స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. వారికి విధులు నిర్వహించడం, అదనపు బాధ్యతలు అప్పగించడం తలనొప్పిగా మారింది. చాలా వరకు పంచాయతీలకు వెళ్లినా పాపానపోలేదు. మండలంలోని 14 పంచాయతీలు ఉండగా 42 అనుబంధ గిరిజన గ్రామాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసింది. అయితే మరమ్మతు లేక కొన్ని జీపీల్లో మూలనపడ్డాయి. పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తుండడంతో దోమల వృద్ధి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఫాగింగ్ చేయాలని అధికారులను కోరుతున్నా నిధుల్లేక మరమ్మతు చేపట్టడం లేదని చెబుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా దోమల నివారణకు ఫాగింగ్ మిషన్ అందుబాటులో తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ఉండాలి

దోమలు స్వైరవిహారంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పంచాయతీ అధికారులు ఫాగింగ్ మిషన్లు వెంటనే అందుబాటులో ఉంచాలి. పంచాయతీ సిబ్బందితో ప్రతిరోజూ ఫాగింగ్ చేయాలి.

– జాధవ్ సత్యపాల్, లింగాపూర్

చర్యలు తీసుకుంటాం

గ్రామల్లో పారిశుధ్య సమస్య, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్లకు మరమ్మతు చేపడుతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీవో, లింగాపూర్

క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని మెట్టిగూడ పాఠశాల ఉపాధ్యాయుడు పెందోర్ విశ్వేశ్వరావు బదిలీపై ఆసిఫాబాద్ మండలం కొటగూడ ప్రాథమిక పాఠశాల వెళ్తున్న సందర్భంగా ఆదివాసీలు ఆదివారం ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన చేసిన సేవలను కొనియాడారు. టీయూటీఎఫ్ జిల్లా నాయకుడు నైతం నారాయణ, మెట్టిగూడ గ్రామపటేల్ పెందోర్ దత్తు, శంకర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో వైద్యశిబిరం



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించారు. హెచ్‌ఈవో రవిదాస్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రమోద్, ఏఎన్ఎం పుష్ప, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం మండల అధ్యక్షుడు బట్టమేకల గట్టయ్య తెలిపారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 11.30 గంటలకు వేడుకలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు జెండా ఎగరవేస్తారని తెలిపారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కృష్ణాష్టమి వేడుకలకు రామాలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మొక్కలు ఎండిపోగా వృథాగా తొట్టీలు

పగిలిన తొట్టీలు... ఎండిన మొక్కలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సిమెంట్ పూల తొట్టీలు సరైన నిర్వహణ లేక అధ్వాన్నంగా తయారయ్యాయి. వీటి కోసం వెచ్చించిన లక్షల రూపాయలు నిష్ప్రయోజనంగా మారాయనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పలు సిమెంట్ తొట్టీలు పగిలిపోయి మొక్కల పెంపకం చేపట్టని పరిస్థితులు ఉండగా, పదుల సంఖ్యలో పూలమొక్కలు సరిగ్గా నీటి తడులు అందించక, సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఎండిపోయాయి. ఎండిపోయిన పూల మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లిప్తతకు అద్దం పడుతోంది. ఏర్పాటు చేసిన ఏడాది కాలంలోపే సిమెంట్ తొట్టీలు, పూల మొక్కలు క్రమంగా ఆనవాళ్లు కోల్పోవడంతో ఖర్చు చేసిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిందనే విమర్శలు పురప్రజల నుంచి వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పూల మొక్కల సంరక్షణ చర్యలను చిత్తశుద్ధితో నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఏజెన్సీ బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

బెజ్జూర్: తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 27న ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ బంద్‌కు మండల ఆదివాసీ సంఘాలు కోయ, కొలవార్ (మన్నెవార్) సేవా, ఉపాధ్యాయ, నిరుద్యోగ, మహిళ సంఘాల మద్దతు ఉందని పేర్కొన్నారు. తొమ్మిది తెగల ప్రజలు, నాయకులు, యువకులు ఈ బంద్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు కొడప విశ్వేశ్వర్, కొడప శంకర్, తిరుపతి, రమేశ్, పుల్లయ్య, ప్రశాంత్, ప్రభాకర్, కాలం గిరి, వినోద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాటం చేయాలి



మాట్లాడుతున్న కనక ప్రభాకర్

కెరమెరి: గిరిజన హక్కుల కోసం పోరాటం చేయాలని తుడుందెబ్బ జిల్లా సీనియర్ నాయకుడు కనక ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలను ఎక్కడా అమలు కావడం లేదన్నారు. గిరిజనులు ఎలాంటి ఉద్యమాలు చేయకుంటే ఉనికికే ప్రమాదమన్నారు. ప్రతి ఆదివాసీ సమస్యల సాధనకు నడుం బిగించాలన్నారు. ఈనెల 27న తుడుందెబ్బ పిలుపునిచ్చిన ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. జోడేఘాట్ పోరుగ్రామాల అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు సెడ్మకి తుకారాం, మాజీ సర్పంచ్ తొడోసం జగన్నాథ్ రావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: ఆటో డ్రైవర్లు నూతన చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై ప్రశాంత్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత చట్టాలకు లోబడి పని చేయాలని సూచించారు. లైసెన్సు ధ్రువపత్రాలు తమ వద్ద వెంట తెచ్చుకోవాలన్నారు. అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని, ఎవరైన గంజాయి, రేషన్ బియ్యం అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంత.. చింత

- వారసంతల్లో సౌకర్యాలు కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు, వ్యాపారులు



బెజ్జూర్‌లోని వారసంత

బెజ్జూర్: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే సంతలో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ ఏటా సంత వేలం ద్వారా వచ్చే ఆదాయంపై పంచాయతీ అధికారులకు ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనపై లేదు. వ్యాపారులు ఎక్కడపడితే అక్కడే కూర్చొని కూరగాయలు విక్రయిస్తున్నారు. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతున్నారు. సంతల్లో వ్యాపారులు కూర్చుకునేందుకు సరైన వసతులు, గద్దెలు లేవు. అదే విధంగా నేలపై బురదలో కూర్చొని వ్యాపారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలకు సరుకులు సైతం తడిసిపోతున్నాయి. బెజ్జూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించే వారసంతల్లో ఇదే పరిస్థితి ఉంది.

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా

మారుమూల గ్రామాల్లో పల్లె సూపర్‌మార్కెట్‌గా వారసంతలు పేరొందాయి. వారసంతల్లో అన్నిరకాల సామగ్రి, కూరగాయలు, బట్టలు, ఆటబొమ్మలు, శుభకార్యాలకు సంబంధించి వస్తువులు లభిస్తాయి. ఈ వారసంతలతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. ఏడాదికి సంతలకు ఆదాయం లక్షల్లో ఉన్నా.. సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ ప్రతి వారం వ్యాపారుల వద్ద నుంచి డబ్బులు తీసుకుంటున్నా వసతులు కల్పించడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వారసంతలో సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. వర్షం కురిస్తే సరుకులు తడిసిపోతున్నాయి. వ్యాపారులు కూర్చోవడానికి గద్దెలు లేవు. గ్రామపంచాయతీ అధికారులు సంతలో సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలి.

– మల్లక్క, కూరగాయల వ్యాపారి

గద్దెలు ఏర్పాటు చేయాలి



వారసంతలో నేలపై కూర్చొని కూరగాయలు విక్రయించాలి. వర్షాకాలంలో ఇబ్బందిగా ఉంది. పంచాయతీ అధికారులు గద్దెలు ఏర్పాటు చేయాలి.

– కొండ సాయి కుమార్, వ్యాపారి

కొండ చిలువ కలకలం



మందమర్రిలో పట్టుకున్న కొండచిలువతో స్నేక్ క్యాచర్స్

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలోకి ఆదివారం సాయంత్రం ఓ భారీ కొండచిలువ ప్రవేశించటం కలకలం రేపింది. సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి కాలనీ వైపు వచ్చిన కొండచిలువను గమనించిన స్థానికులు, కర్రల సాయంతో చంపివేశారు. ఏపుగా మొలచిన చెట్ల పొదల కారణంగా తరచూ విషపురుగులు ప్రవేశిస్తున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని కాలనీవాసులు మండిపడ్డారు.

మందమర్రిలో పిల్లిని మింగిన కొండచిలువ

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని సీఈఆర్ క్లబ్ ఎదుట గల గాంధీనగర్‌లో కొండ చిలువ ఆదివారం హల్‌చల్ చేసింది. గాంధీనగర్ పక్క నుంచి వెళ్లే ఒర్రె పక్కన గల తుమ్మ రవీందర్ ఇంట్లోకి చేరింది. ఇంట్లో సామాను వెతుకుతుండగా కొండ చిలువ కనిపించింది. వెంటనే పాములు పట్టే మహేందర్ అనే వ్యక్తికి సమాచారం అందించగా, ఆయన టీమ్‌తో వచ్చి కొండ చిలువను పట్టాడు. ఈ క్రమంలో దాని కడుపులో నుంచి పిల్లి కళేబరం బయటికి రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం కొండచిలువను భద్రంగా తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు మహేందర్, వారి టీమ్ తెలిపింది.



రామకృష్ణాపూర్: హతమైన కొండ చిలువ

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు



దహెగాం: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్ల నుంచి ఒంటరిగా బయటకు రావాలంటే జంకుతున్నారు. రాత్రివేళ వాటి కుక్కల అరుపులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా కోతుల బెడదతో చిన్నాపెద్దలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైనే పశువులు



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయం ఎదుట ప్రధాన రహదారిపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. రోడ్డుపై పశువులు తిష్ట వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతి



ఎమ్మెల్సీ కోదండరామ్‌తో వెంకటసాయి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆదివారం తెలంగాణ జన సమితి సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కన్వీనర్ పాముల వెంకటసాయి హైదరాబాద్‌తో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కోదండరామ్ జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేలా పెద్దపీట వేయాలని విన్నవించి, ఎమ్మెల్సీగా జిల్లా పర్యటన చేపట్టాలని కోరినట్లు వెంకటసాయి తెలిపారు.

సీసీఎస్-1 సీఐగా కేశవులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సీసీఎస్-1 సీఐగా బి.కేశవులు బదిలీ అయ్యారు. హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న కేశవులు జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టుకు బదిలీ చేశారు. ఈ మేరకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన కార్యవర్గం

దండేపల్లి: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుంచె ప్రసాద్, అధ్యక్షుడిగా బండి రవి, ఉపాధ్యక్షులుగా బూసిరాజు రాజన్న, మెంగని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజన్న, కార్యదర్శిగా మహ్మద్ శరీఫ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్పీ హరీష్ ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం

దండేపల్లి: రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధుల నిర్వర్తించిన రాజలింగం పక్షవాతంతో మంచం పట్టాడు. దీంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు.